క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై వేటు



అక్రమ కట్టడాలని తొలగిస్తున్న అధికారుల

కర్నూలు (టౌన్): నగరంలో అక్రమ నిర్మాణాలపై వేటు ప్రారంభమైంది. స్థానిక సుంకేసుల రోడ్డులో రెసిడెన్షియల్ భవనంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను మంగళవారం తొలగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, ఏసీపీ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, చైన్‌మెన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు సి.క్యాంప్ రైతుబజార్ బంద్

కర్నూలు(అగ్రికల్చర్): పరిశుభ్రత పనుల నిమిత్తం సి.క్యాంప్ రైతుబజార్ బుధవారం బంద్ చేయనున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ హరీష్ కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ మంగళవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. గురువారం నుంచి యథావిధిగా రైతుబజార్ పనిచేస్తుందన్నారు.

రేపు 'శివలీలా విలాస లింగత్వం'పై ప్రవచనం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని జగన్నాథ గట్టుపై కొలువైన రూపాల సంగమేశ్వర దేవస్థానంలో ఈనెల 27న ఉదయం 9 గంటలకు 'శ్రీ శివలీలా విలాస లింగత్వం'పై ప్రవచనం ఉంటుందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి బి.ప్రసన్నలక్ష్మి మంగళవాకం తెలిపారు. నైమిశారణ్య పీఠాధిపతి పూజ్య బాల బ్రహ్మానంద సరస్వతి హాజరై ప్రవచనం చెబుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు(సెంట్రల్): నూతనంగా పదవులు పొందిన వారు పార్టీ అభ్యున్నతికి పనిచేయాలని ఎస్‌డీపీఐ నగర అధ్యక్షుడు హుస్సేన్ కోరారు. మంగళవారం నగర కమిటీ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన జహంగీర్ అహ్మద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పార్టీలో పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్లా, జలీల్ అహ్మద్, షేక్ షఫీ, చాంద్‌బాషా, ఆరిఫ్, ఫయాజ్ పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేయండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు సేవలందించడంలో బాధ్యతతో పనిచేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.సుబ్బన్న సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

కర్నూలు(సెంట్రల్): మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మణిపూర్ ఘటనలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నబి రసూల్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు చలో ఢిల్లీ

కర్నూలు కల్చరల్: రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాల్లో సమాన వాటా డిమాండ్ చేస్తూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో 'సేవ్ రాయలసీమ' పేరుతో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కర్నూలు నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈనెల 28న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టనున్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రాయలసీమ జిల్లాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు, రాయలసీమ జిల్లాల ప్రజలు నిరసనలో పాల్గొననున్నారు.

ఆరుగురికి తీవ్రగాయాలు

కోడుమూరు రూరల్: ఓ కారు కల్వర్టును ఢీకొన్న ఘటనలో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని రానాపురం ప్రాంతానికి చెందిన వామాకాంత్ దేశ్‌ముఖ్, మహేష్, బాలు, సునీల్, జయధన్, ప్రవీణ్ సింధే కారులో తీర్థయాత్రలు చేస్తూ సోమవారం రాత్రి తిరుపతి నుంచి మంత్రాలయం రాఘవేంద్రుడి దర్శనార్థం బయలుదేరారు. కోడుమూరు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వేగంగా రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొట్టాడు. కారులోని ఏయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ముందు కూర్చున వారికి కొంత ప్రమాద తీవ్రత తగ్గింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కోడుమూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమిక చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు.

తీరు మారలేదు..

ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడపటం.. ఆపకూడని చోట వాహనం ఆపి వెనకాల చూసుకోకుండా డోర్ తీయడం.. కారు చూసుకోకుండా వెనక్కు తీయడం.. పిల్లలకు వాహనాలు ఇవ్వడం.. రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా వెళ్లిపోవడంలాంటి ఉల్లంఘనలతో ప్రమాదాలకు కారకులవుతున్నవారెందరో. ఇలాంటి వారికి ఇటీవల ఫైన్లు వేస్తున్నా మార్పు రావడం లేదు. ఆరు నెలల వ్యవధిలో 1.56 లక్షల ఉల్లంఘనల కేసులు నమోదుకావడం ఆందోళన కలిగించే విషయం. - కర్నూలు

- చలానాలు విధించినా వాహనదారుల్లో కానరాని మార్పు
- ఆరు నెలల వ్యవధిలో 1.56 లక్షల ఉల్లంఘన కేసులు
- స్వీయ క్రమశిక్షణతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్!



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న దృశ్యం

వాహనదారుల్లో మార్పు రావడం లేదు. చలానాలు వేస్తున్నా పదే పదేఉల్లంఘనులకు పాల్పడుతున్నారు. ఫలితంగా ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఆరు లక్షలకు పైగా జనాభా, లక్షల్లో వాహనాలు, తగినంత వెడల్పు రోడ్లు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. ఇలాంటి చోట స్వీయ నియంత్రణ, పౌర స్పృహతోనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది.

ఎక్కడ ఆపకూడదో చెప్పించుకోవద్దు..

వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలి.. గుర్తింపు కలిగిన డ్రైవింగ్ స్కూల్‌లో ముందుగా వీటిని నేర్పించిన తర్వాతే వాహనం చేతికిస్తారు. అయితే ఎక్కువ మంది స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల సాయంతో డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. అలాంటి వారికి డ్రైవింగ్ వస్తున్నప్పటికీ రహదారి నిబంధనలపై ఏమాత్రం అవగాహన ఉండటం లేదు. రోడ్డు పక్కన పండ్లు కొనేందుకు పండ్ల బండి ముందు కారు ఆపొచ్చు. కానీ పక్కనే ఆపి బేరమాడుతుంటారు. దీంతో వెనకాల వాహనాలు ఆగిపోయి కర్నూలు నగరం ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

పిల్లలకు బండి ఇస్తున్నారు

చిన్నతనంలోనే తమ పిల్లలు ద్విచక్ర వాహనాలు, కార్లు నడపటాన్ని కొందరు పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. చాలా పాఠశాలల్లో 15 ఏళ్లలోపు పిల్లలు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నారు. అటు తల్లిదండ్రులు, ఇటు యాజమాన్యాలు వారిని కనీసం హెచ్చరించడం లేదు. పిల్లలు వేగంగా వెళ్తూ ఎదుటి వాహనాలను ఢీకొడుతున్నారు. 18 ఏళ్లు నిండి లైసెన్స్ వచ్చిన తర్వాతే బండి చేతికి ఇవ్వండని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మార్పు కనిపించడం లేదు.

మొబైల్‌తో డ్రైవింగ్..

కొంతమంది మొబైల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడుపుతున్నారు. హఠాత్తుగా ముందు ఏదైనా అడ్డు వస్తే నియంత్రించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇతరులను ఢీకొడుతున్నారు. ఫోన్ వస్తే వాహనాన్ని పక్కన ఆపి మాట్లాడాలని ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కర్నూలు నగరంలోని చాలా ప్రాంతాల్లో రాంగ్ రూట్‌లో ఎక్కువగా వాహనాలు నడుపుతున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. దూరమైనా సరే.. తిరిగి రావాలి తప్ప రాంగ్ రూట్‌లో ప్రయాణించకూడదు.

హారన్ మోగించడం..

కొందరు వాహనదారులు అవసరం లేకపోయినా హారన్ మోగిస్తుంటారు. ఆసుపత్రులు, మరికొన్ని చోట్ల అధిక శబ్దాలు చేయరాదనే నిబంధన ఉన్నా అతిక్రమిస్తున్నారు. ముందర ట్రాఫిక్ జామ్ అయినప్పుడు హారన్ కొట్టినా ఉపయోగముండదు. అయినా కొంతమంది వాహనదారులు మోగిస్తూ ధ్వని కాలుష్యానికి కారణమవుతున్నారు.

జరిమానాలు విధిస్తున్నా కనిపించని మార్పు

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు జరిమానాలు విధిస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు 1.56 లక్షల ఉల్లంఘన కేసులు నమోదయ్యాయంటే వాటి తీవ్రతకు అద్దం పడుతోంది. జరిమానా రూపంలో వీరు రూ.3.07 కోట్లు చెల్లించారు.

నిండా నిర్లక్ష్యం

ఈ చిత్రంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వాహనం తోలుతున్న వ్యక్తి హెల్మెట్ ధరించకపోగా దానిని బైక్‌కు వేలాడదీసి ప్రయాణిస్తున్నారు. మరికొందరు వెనుక కూర్చున్న వ్యక్తి చేతికి ఇచ్చి వాహనాలు తోలుతుంటారు. కానీ అది తమ ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని గుర్తించలేకపోతున్నారు. ఏదో ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకోవడానికేనన్నట్లు వ్యవహరిస్తున్నారు.





ఆటోడ్రైవర్లకు చలానా వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆరు నెలల్లో వాహనదారులపై నమోదైన కేసులు

హెల్మెట్ ధరించకుండా నడిపిన కేసులు	- 37,483
వన్‌వేలో రాంగ్‌రూట్ వెళ్లిన కేసులు	- 1,393
మొబైల్‌మాట్లాడుతూ నమోదైన కేసులు	- 1,716
సీటు బెల్టు ధరించకపోవడం	- 4,127
అతివేగంపై నమోదైన కేసులు	- 12,214
ఓవర్‌లోడ్‌తో వెళ్లిన వాహనాలపై కేసులు	- 1,819
ట్రిపుల్ రైడింగ్‌లో పట్టుబడిన కేసులు	- 6,612
రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలపై కేసులు	- 4,230
రాంగ్ పార్కింగ్ త్రీ వీలర్లపై కేసులు	- 3,602
నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై కేసులు	- 2,536
డ్రంకెన్ డ్రైవ్‌తో పట్టుబడిన కేసులు	- 819
రికార్డులు లేని వాహనాలపై నమోదైన కేసులు	- 64,926
మైనర్ డ్రైవింగ్ కేసులు	- 303
లైసెన్స్ లేకుండా పట్టుబడిన కేసులు	- 3,506

నిబంధనలు పాటించాలి



ప్రాణం వెలకట్టలేనిది. ప్రజల రక్షణ కోసమే ఎన్నో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో పాటు చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఒక్కరూ వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించి ప్రాణాలను రక్షించుకోవాలి. మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు. కుటుంబాలకు తీరని శోకాన్ని మిగల్చవద్దు. నిబంధనలు పాటిస్తే కుటుంబానికే కాదు.. సమాజానికి మేలు చేసినవారవుతారు.

- నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ

ప్రశాంతంగా ఈట్ స్ట్రీట్ వేలాలు

- లాటరీ ద్వారా షాపుల కేటాయింపు



లాటరీ పద్ధతిన షాపులు కేటాయిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని బిర్లా గేట్ ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేయనున్న ఈట్ స్ట్రీట్ (ఖనా ఖజానా)కు షాపుల వేలాలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఏడు షాపులకు (1 ప్లస్1) పెద్ద సంఖ్యలో వ్యాపారులు దరఖాస్తు చేసుకోగా లాటరీ పద్ధతిన కేటాయించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొని పారదర్శంగా షాపులను కేటాయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వాసుల ఆహ్లాదం కోసం ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వీటి ద్వారా రెవెన్యూ విభాగానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కాగా చాట్ బండారు యూనిట్‌ను టి.వెంకటరమణమ్మ, సి.శరత్, పిజ్జా, బర్గర్ యూనిట్ మాటపతి కిషోర్ కుమార్, అంగడి రమీజా, ఐస్ పార్లర్ యూనిట్ తలంకి పవన్‌కుమార్, టి.తన్మయ్, బిర్యానీ యూనిట్ రేవలి లక్ష్మి, కటిక రెహమాన్, శాఖా ఫలహార శాల పసుపుల నవీన్, కోడుమూరు ధీరజ్, జ్యూస్ సెంటర్ యూనిట్ షేక్ అన్సర్ బాషా, పసుపుల భార్గవి, కాఫీ, టీ యూనిట్ షేక్ మహబూబ్ బాషా, చాకలి చంద్ర శేఖర్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కల్లూరు: స్థానిక 19వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రామన్ని నిర్వహించనున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి సమస్యలను గుర్తించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈఈ రవి ప్రకాష్‌నాయుడు, ఏఈలు జనార్దన్, రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: కల్లూరు మండలం ముజఫర్ నగర్‌లోని ఫారుక్ నగర్‌లో నివాసముంటున్న చింతరేవుల నరసింహులు(56) అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి ఈయన స్వగ్రామం. పదిహేనేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కర్నూలుకు వచ్చి ఫారుక్ నగర్‌లో నివాసముంటూ ఐస్ ఫ్యాక్టరీ నిర్వహణతో కుటుంబాన్ని పోషించేవాడు. కరోనా సమయంలో వ్యాపారం నడవక అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు గుండెజబ్బు, షుగర్ తదితర వ్యాధులతో బాధ పడేవాడు. నెల రోజుల క్రితం ఇంట్లో మెట్లు దిగుతూ కాలు జారి కింద పడి కుడి కాలు బెణికింది. వైద్యం చేయించుకున్నప్పటికీ జబ్బు నయం కాకపోవడంతో పాటు కరోనా సమయంలో చేసిన అప్పులు తీర్చలేమోనని కుటుంబ సభ్యులతో బాధ పడేవాడు. మంగళవారం మధ్యాహ్నం భార్య జయమ్మ, కుమారుడు విజయ్ బ్యాంకు పనిమీదు బయటకు వెళ్లిన తర్వాత నరసింహులు తన గదిలోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కాసేపటి తర్వాత భార్య, కుమారుడు వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కిందికి దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

'టీ డే'లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



కలెక్టరేట్ సమీపంలో టీ డే షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రజారోగ్యశాఖ అధికారులు



శాంపిల్స్ సేకరిస్తున్న తనిఖీ అధికారి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కలెక్టరేట్ వద్దనున్న శ్యాలమ్మ సత్రం భవనంలో అనధికారికంగా నిర్వహిస్తున్న 'టీ డే' స్టాల్‌లో మంగళవారం సాయంత్రం ఆహార నియంత్రణ విభాగం(ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు) అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ తయారయ్యే టీపై ఆహార నియంత్రణ విభాగానికి ఇటీవల ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానాయకులు, కర్నూలు డివిజన్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఎన్.రాముడు, సూపరింటెండెంట్ అన్వర్‌బేగ్‌లు తనిఖీలు చేపట్టారు. టీ దుకాణంలో విక్రయిస్తున్న టీతో పాటు వినియోగిస్తున్న టీ పొడి శాంపిల్స్ తీసుకొని పంచనామా రాశారు. టీ దుకాణానికి అనుమతులపైనా ప్రశ్నించారు. భవనంలోకి ఏర్పాటు చేసిన దారిలో టీ స్టాల్ ఎలా ఏర్పాటు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా ఆహార విక్రయ వ్యాపారం చేయాలంటే అనుమతి తీసుకోవాలని, ఇవేవీ లేకుండా వ్యాపారం ఎలా చేస్తారని మండిపడ్డారు.

సురక్షతో అర్హులందరికీ ఉచిత సేవలు

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు (టౌన్): జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ ఉచిత సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక 4, 10, 14, 15 వార్డుల పరిధిలోని 11, 24, 34, 37 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పాల్గొని మాట్లాడుతూ పారదర్శక పాలనకు నిదర్శనం జగనన్న ప్రభుత్వమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అనేది సర్వే చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం సచివాలయాల ద్వారా కృషి చేస్తుందన్నారు. అనంతరం అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ యూనస్ బాషా, మాజీ మేయర్ బంగి అనంతయ్య, శ్రీరాములు, పార్టీ నాయకులు పాల్గొన్నారు

మీ పార్టీ భవిష్యత్‌కే గ్యారంటీ లేదు

అన్ని వర్గాలను మోసం చేసిన తెలుగుదేశం పార్టీ భవిష్యత్‌కే గ్యారంటీ లేదని, మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు ఇప్పుడు 'మీ భవిష్యత్తుకు గ్యారెంటీ' నినాదంతో రోడ్డెక్కుతున్నారని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ విమర్శించారు.14 ఏళ్లపాటు ఆ పార్టీ నాయకు లకు ప్రజలు, మహిళలు, పేదల భవిష్యత్ కనిపించలేదన్నారు. టీజీ కుటుంబం ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో వారికే తెలియదన్నారు. నాలుగున్నరేళ్లు ప్రజల గురించి పట్టించుకోకుండా ఎన్నికలు సమీపిస్తుండటంతో పేదలు గుర్తుకు వస్తున్నారన్నారు. కర్నూలులో ఇప్పుడిప్పుడే పెద్దయ్య, చిన్నయ్య నాటకాలు ప్రారంభమయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రజలందరి భవిష్యత్‌కు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కొండలా అండగా ఉన్నారన్నారు.

సచివాలయాల్లోనే దరఖాస్తు

కర్నూలు(రాజ్‌విహార్): ఏ పథకం కావాలన్నా సమీపంలోని సచివాలయానికి వెళ్తే దరఖాస్తు చేస్తారని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక 11వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఖడక్‌పురా వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదింటికి మంచి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన వారు వీటిని దరఖాస్తు చేసుకునేందుకు ఏ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండరాదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్, పార్టీ నాయకులు నూరుల్లా ఖాద్రీ, ఫైజల్‌ఖాన్, జుబేర్, దావూద్, షబ్బీర్ పాల్గొన్నారు.



ఖడక్‌పురలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

స్ఫూర్తి నింపుతూ.. పౌరుషాన్ని చాటుతూ



మిలిటరీ కాలనీ ఏరియల్ వ్యూ

- వీరజవానుల గ్రామం మిలిటరీ కాలనీ
- రెండో ప్రపంచ యుద్ధానికి జిల్లా నుంచి 72 మంది
- పదవీ విరమణ అనంతరం వారికి ఇళ్లు కట్టించి ఇచ్చిన అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం



కర్నూలు (న్యూటౌన్): 1939 - 1945. అది రెండో ప్రపంచ యుద్ధ కాలం. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంలోని నలుమూలల నుంచి సైన్యంలోనికి యువతను రిక్రూట్ చేసింది. శరీర దారుఢ్యం కలిగిన వారు చాలా మంది సైన్యంలో ఆసక్తిగా చేరారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొని వీరోచితంగా పోరాడారు. అనంతరం పదవీ విరమణ పొంది స్వదేశానికి తిరిగొచ్చారు. వారి కోసం అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కానుకలను సమర్పించింది. అందులో భాగంగా 1948లో కర్నూలు జిల్లా కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో ఒక్కొక్కరికి 9 సెంట్ల స్థలం కేటాయించి, 3 సెంట్లలో ఇళ్లు నిర్మించి ఇచ్చింది. దానిపేరే మిలిటరీ కాలనీ. ఇంటితో పాటు కేడర్‌ను బట్టి 3 నుంచి 8 ఎకరాల పొలం, ఆవు కానుకగా ఇచ్చింది. కాలక్రమంలో వారు వయసుపైబడి మృతిచెందగా ప్రస్తుతం వారి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాగా యుద్ధవీరుల భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. వారి కుటుంబ సభ్యులు కొందరు పోరాడి దక్కించుకోగా, మరికొందరు ఇంకా పోరాడుతూనే ఉన్నారు.

నాన్నే స్ఫూర్తి



మా నాన్న డేవిడ్ రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవను ఎన్నటికీ మరువను. ఆయన స్ఫూర్తితోనే నేను ఆర్మీలో చేరాను. దేశ రక్షణలో నేను సైతం ఉండాలన్నదే నా ఆశయం.

- పోలుకంటి జాషువా

దేశసేవలో..



రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న జిల్లాకు చెందిన 72 మందిలో మా నాన్న బండి ఏసుదాసు ఒకరు. ఆయన బాటలో నడవాలన్నది నా లక్ష్యం. అందుకే ఆర్మీలో చేసి దేశ సేవలో పాలు పంచుకుంటున్నాను.

- బండి సుందర్‌రావు

మా నాన్న యుద్ధంలో పాల్గొన్నాడు



మాది కొత్తపల్లె మండలం ఎం లింగాపురం. మా నాన్న సీహెచ్ పాలు 1942 నుంచి 1946 వరకు నాలుగేళ్ల రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. నాన్న తిరిగొస్తారో లేదోనని ఎంతో కుమిలిపోయేవాళ్లం. క్షేమంగా తిరిగి రావడంతో సంతోషించాం. యుద్ధంలో పాల్గొన్నందుకు మానాన్నకు బ్రిటీష్ ప్రభుత్వం మిలిటరీ కాలనీలో ఇల్లు, పొలం ఇచ్చింది. అనంతరం 1991లో మానాన్న కాలం చేశారు. ఆయనయుద్ధంలో పాల్గొనడం మాకు గర్వంగా ఉంది.

- అగస్టీన్, మిలిటరీ కాలనీ

మా తాత త్యాగం మరువలేనిది



మా తాత పుల్లన్న చివరి మూడేళ్లు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధానికి వెళ్లి తాత ప్రాణాలతో తిరిగి రావడం నమ్మలేకపోయాం. మా తాత త్యాగం ఎన్నటికీ మరువలేనిది. యుద్ధం చేసి తిరిగి రావడంతో అప్పటి ప్రభుత్వం సాగు భూమి, నివాస స్థలం ఇచ్చారు. ప్రస్తుతం మేము మిలిటరీ కాలనీలోనే నివాసం ఉంటున్నాం.

- విజయుడు, మిలిటరీ కాలనీ